@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || గురువారం 06, జూన్ 2024 || పేజీలు: 04

## చంద్రబాబు పిలిస్తే వెళ్తా

### – సీఎం రేవంత్ రెడ్డి



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్5:**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయంపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో ఏ ప్రభుత్వం వచ్చినా ఆ ప్రభుత్వంతో సామరస్యంగానే ముందుకు వెళ్లి రాష్ట్ర సమస్యలు పరిష్కరించుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని గతంలో కూడా చెప్పానంటూ ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా ఏపీ ప్రత్యేక హోదా అనే అంశం చట్టబద్ధతతో కూడుకున్న హామీ అంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు రాహుల్ గాంధీ కట్టుబడి ఉన్నారని ఆయన అన్నారు. ఈ అంశంపై తమ పార్టీలో చర్చించిన తరువాత చంద్రబాబుతో మాట్లాడుతానంటూ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఏపీలో త్వరలో మిగతా 2లో..

## ఏపీ అసెంబ్లీ రద్దు..

- గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ
- 9న అమరావతిలో సీఎంగా బాబు ప్రమాణ స్వీకారం




**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్5:**

ఏపీ అసెంబ్లీని రద్దు చేస్తూ.. గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం సీఎం పదవికి రాజీనామా చేయగా.. దానిని గవర్నర్ ఆమోదించారు. జగన్ రాజీనామాతో ఆంధ్రప్రదేశ్ శాసనసభను రద్దు చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 9న అమరావతిలో సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జూన్ 9న మిగతా 2లో..

## టీడీపీ, జనసేన శ్రేణుల విధ్వంసం..

### వైసీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు

- పలుచోట్ల విగ్రహాలు, శిలాఫలకాల ధ్వంసం, వాహనాల దహనం
- సచివాలయ బోర్డుల తొలగింపు





**నేటి ఫోకస్ న్యూస్, మంగళగిరి/పల్నాడు-జూన్ 05:**

**రాష్ట్రంలో టీడీపీ, జనసేన శ్రేణులు** విధ్వంసం సృష్టిస్తున్నాయి. యథేచ్ఛగా విగ్రహాలు, శిలాఫలకాలు ధ్వంసం చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నాయి. వాహనాలను ధ్వంసం చేస్తున్నాయి. మంగళవారం మొదలుపెట్టిన ఈ అరాచకపర్వాన్ని టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు బుధవారం కూడా కొనసాగించారు. ఈ రెండురోజులు ప్రభుత్వ భవనాల వద్ద ఫలకాలను చిత్రపటాలను ధ్వంసం చేస్తూ స్వైరవిహారం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో మహానేత వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేసి, విగ్రహాల వద్ద కూటమి జెండాలు ఏర్పాటు చేశారు. ఇప్పటంలో ప్రజల భాగస్వామ్యంతో నిర్మించిన దివగంత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరుతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ భవనం పైభాగంలో జనసేన, టీడీపీ జెండాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో 1, 2 సచివాలయాల వద్ద వైఎస్ జగన్ డిజిటల్ బోర్డులను తొలగించి రోడ్డుపై పడవేసి చిత్రపటంపై రాళ్లు వేశారు. నూతన సచివాలయం శిలాఫలకంలో ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని చిన్నపిల్లలతో పగులగొట్టించారు. రైతుభరోసా కేంద్రంపై నవరత్నాల బోర్డును ధ్వంసం చేశారు. పల్నాడు జిల్లా గోళ్ళపాడులో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ శిలాఫలకాన్ని మిగతా 2లో..



## ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం

**నాడు 3 సీట్లిచ్చిన ప్రజలు.. నేడు 8 సీట్లిచ్చారు..**

- గెలుపోటములకు పీసీసీ చీఫ్‌గా పూర్తి బాధ్యత నాదే..
- బీజేపీకి-బీఆర్ఎస్ బిఆర్ఎస్ పూర్తిగా అమ్ముడుపోయింది
- ఉమ్మడి ఏపి సమస్యలను పరిష్కరించుకుంటాం
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్5:**

**ప్రజలు ఇచ్చిన తీర్పును** గౌరవిస్తున్నామని, ఇది తమకు ఉడాది పచ్చడి లాంటిదని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. పార్మలెంట్ ఎన్నికల్లో తమ మీద విశ్వాసం ఉంచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సంతోషాన్నిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రతోనే కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని చెప్పారు. కాంగ్రెస్ ను ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఖర్గే, సోనియా దిశానిర్దేశంతో మంచి ఫలితాలు సాధించామని స్పష్టం చేశారు. వంద రోజుల పాలను ప్రజలు ఆదరించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మా ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. అందుకే కాంగ్రెస్ పాలనను మెచ్చుకుని ప్రజలు ఓటేశారని వెల్లడించారు సీఎం రేవంత్ రెడ్డి. 2019లో మూడు ఎంపీ సీట్లు ఇస్తే 2024లో ఆ సంఖ్య 8కి పెరిగిందని చెప్పారు.బీజేపీ గెలిచిన 8 సీట్లలో బీఆర్ఎస్ 7చోట్లలో డిపాజిట్లు కోల్పోయిందని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆత్మబలిదానం చేసుకుని బీజేపీని గెలిపించారన్నారు. జేపీని గెలిపించడానికి కేసీఆర్ బలహీనమైన అభ్యర్థులను పెట్టారంటూ ఆరోపించారు. మిగతా 2లో..



## రాష్ట్రమంతా నైరుతి

- హైదరాబాద్‌లో కురిసిన వర్షానికి జలమయమైన రోడ్డు
- వారంలో విస్తరించనున్న రుతుపవనాలు
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:**

నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఈనెల 3న రాష్ట్రంలోని ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. రెండ్రోజుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తెలంగాణ లోని నారాయణపేట, మిగతా 2లో..



## లోక్‌సభ రద్దు

- ప్రకటన విడుదల చేసిన రాష్ట్రపతి భవన్

వివరాలు 02లో..

## జవాబుదారీగా ప్రభుత్వాన్ని నడుపుదాం

- కచ్చితంగా జీతం తీసుకుని పనిచేస్తా
- ప్రజల స్వేదం చిందించిన డబ్బుతో అప్రమత్తంగా ఉంటా
- ఎంపిలు, ఎమ్మెల్యేలతో భేటీలో పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు



**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్5:**

ఎమ్మెల్యేగా తాను పూర్తి జీతం తీసుకుంటానని జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఏపీ ఎన్నికల్లో సంచలన విజయం తర్వాత జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఫలితాలు మరింత బాధ్యత పెంచాయని అన్నారు. 'నేను కూడా ఎమ్మెల్యేగా మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్

గురువారం 06, జూన్ 2024

# లోక్‌సభ రద్దు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ–జూన్5:**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 17వ లోక్‌సభను రద్దు చేశారు. ప్రస్తుత లోక్‌సభను రద్దు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర క్యాబినెట్ బుధవారం ఉదయం సిఫారసు చేసింది. ఆ వెంటనే మోదీ తన రాజీనామాతో పాటు మంత్రివర్గ రాజీనామా పత్రాలను రాష్ట్రపతిని కలిసి నేరుగా కలిసి సమర్పించారు. రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలుపుతూ, కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసేంతవరకూ ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగాలని మోదీని కోరారు. అనంతరం కొద్ది గంటలకే 17వ లోక్‌సభను రద్దయినట్టు రాష్ట్రపతి భవన్ నుంచి ఒక ప్రకటన వెలువడింది. జూన్ 5వ తేదీ 2024న కేంద్ర మంత్రివర్గం చేసిన సిఫారసు మేరకు రాజ్యాంగంలోని 85వ నిబంధన సబ్–క్లాజ్ (2) కింద నాకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ 17వ లోక్‌సభను రద్దు చేస్తున్నాను' అని రాష్ట్రపతి భవన్ నుంచి వెలువడిన ప్రకటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కాగా, ప్రస్తుత లోక్‌సభ రద్దు కావడంతో 18వ లోక్‌సభ ఏర్పాటుకు, కొత్త ప్రభుత్వం కేంద్రంలో పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. షెడ్యూల్ ప్రకారం 17వ లోక్‌సభ గడువు జూన్ 16వ తేదీతో ముగియాల్సి ఉంది.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## – మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–జూన్5:**

పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి , మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన పెంచుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మా జ్యోతి రావు పూలే ప్రజా భవన్ లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జీవించడానికి మన పర్యావరణం చాలా ముఖ్యమైనదని అన్నారు. వాతావరణ అనుకూ లంగా ఉండే విధంగా పర్యావరణం పట్ల శ్రద్ధ వహించడం ముఖ్యంమని అన్నారు. అంతేకాకుండా గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలను నివారించడానికి వివిధ నివారణ చర్యలను కూడా చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ పై ప్రజలకు అవగాహన పెంచుకోవాలని కోరారు. అప్పుడప్పుడు మొక్కలు నాటి పర్యవరణ రణలో భాగస్వాములు కావాలని కోరారు. గ్లోబల్ వార్మింగ్ తగ్గించుకోవడం కోసం పర్యావరణాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం, మనుగడకు, భవిష్యత్తు తరాలకు ప్రాథమిక అవసరం అని గుర్తు చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మొక్కలు నాటి పాఠశాల వాతావరణంలో పచ్చదనాన్ని నెలకొల్పాలని అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసును సుమోటోగా స్వీకరణ

## – పలువురికి నోటీసులు జారీ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–జూన్5:**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఈ కేసును హైకోర్టు సుమోటోగా తీసుకుంది. న్యాయమూర్తుల ఫోన్లు ట్యాప్ చేయడంపై ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పేర్కొంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించాలని తెలిపింది. మీడియాలో వచ్చిన వివిధ కథనాలను సుమోటోగా స్వీకరించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం.. దానిపై విచారణ చేపట్టింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై పూర్తి వివరాలతో నాలుగు రోజుల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని.. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 3 తేదీకి వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బిగ్ టీవీలో ప్రత్యేక కథనాలు ప్రసారమయ్యాయి. హైకోర్టు న్యాయమూర్తులతో పాటు రాజకీయ నేతలు, వ్యాపారస్థుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు బిగ్ టీవీలో వరుస కథనాలు ప్రసారమయ్యాయి.తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం రేపింది. ప్రణీత్ రావు, ప్రభాకర్, భుజంగరావు, రాధాకిషన్ రావులు ఇచ్చిన వాంగ్మూలంలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. 2018 నుంచి రాష్ట్రంలో అందరు అధికారులు, నేతల ఫోన్లను ట్యాప్ చేసిన డేటాను.. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మాయం చేశారు. హార్డ్ డిస్క్ లను ధ్వంసం చేసి.. నాలాల్లో పడేసినట్లు చెప్పారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వెనుకంతా ఉన్నది గులాబీ బాసేనన్న నిజాన్ని బట్టబయలు చేశారు.

## నటి హేమ రేవ్ పార్టీ వ్యవహారం

# మా సభ్యత్వం రద్దు చేసిన మంచు విష్ణు

**నేటి ఫోకస్ న్యూస్, బెంగళూరు–జూన్5:**

రేవ్ పార్టీ కేసులో సినీ నటి హేమను బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేసారు. ఈ కేసులో హేమ డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణైనట్లు పోలీసులు స్పష్టం చేశారు. హేమ విషయంలో పోలీసులు బయటపెట్టిన ఆధారాల ప్రకారం యాక్షన్ ఉంటుందంటూ గతంలో మా అసోసియేషన్ ప్రెసిడెంట్ మంచు విష్ణు ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా హేమ అంశంపై చర్చించిన 'మా' కమిటీ.. నటి హేమ మా సభ్యత్వం సస్పెండ్ చేయడానికి అభిప్రాయాలను కోరారు. దీనిపై మా అసోసియేషన్ గ్రూప్‌లో మంచు విష్ణు మెసేజ్ చేశారు. ఈ మేరకు హేమ సభ్యత్వం రద్దుపై అభిప్రాయాలను సేకరించిన మంచు విష్ణు.. అధిక మంది హేమను సస్పెండ్ చేయడంపై పాజిటివ్‌గా స్పందించినట్లు తెలిపారు. దీంతో ఆమెకు క్లీన్ చీట్ వచ్చేంత వరకు మా అసోసియేషన్‌లో హేమ సభ్యత్వం రద్దు చేయాలని మంచు విష్ణు కీలక నిర్ణయం తీసుకున్నారు. దీనిపై గురువారం మా అధ్యక్షుడు విష్ణు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కాగా బెంగళూరు నగర శివార్లలో రేవ్‌పార్టీలో పాల్గొన్న దాదాపు 150 మందిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో భారీ మొత్తంలో డ్రగ్స్ వినియోగించినట్లు తేలింది. ఈ పార్టీకి మాదకద్రవ్యాలు సమకూర్చారనే ఆరోపణపై ఇప్పటికే సిద్ధిక్, రణధీర్, రాజ్‌భావ అనే వ్యక్తులను కటకటాల వెనక్కినెట్టారు. ఇదే పార్టీకి హాజరైన నటి హేమ తొలుత తాను ఇంట్లోనే ఉన్నానని, రేవ్‌పార్టీలో లేనని పలు వీడియోలు విడుదల చేసింది. ఆ తర్వాత చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల దృష్ట్యా నటి హేమ సీసీబీ దర్యాప్తు అధికారుల ఎదుట లొంగిపోయింది. బుర్కా ధరించి చామరాజపేటలోని సీసీబీ కార్యాలయంలోకి చేరుకున్న హేమ.. అధికారులు అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వకపోవడంతో చివరికి అరెస్టు చేశారు.

# ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి..)

గాంధీభవన్‌లో ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలసి మీడియాతో మాట్లాడారు. సిద్దిపేటలో హరీష్ రావు బీఆర్ఎస్ ఓట్లను బీజేపీకి మళ్లించారన్నారు. కేసీఆర్, హరీష్ కలిసి మెదక్ లో బీజేపీని గెలిపించారని తెలిపారు. వెంకట్రామిరెడ్డిని నమ్మించి మోసం చేశారని తెలిపారు. 37 శాతం ఓట్లున్న బీఆర్ఎస్‌కు 16 శాతానికి చేరిందన్నారు. ఇక దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వాదులును రాహుల్ గాంధీ ఏకం చేశారని చెప్పారు సీఎం రేవంత్. మోదీ వ్యతిరేక విధానాలను రాహుల్ ప్రజలకు వివరించారు. అలాగే తెలంగాణలో వంద రోజుల్లో గ్యారంటీలను అమలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నచ్చితే ఓటు వేయాలని లోక్‌సభ ఎన్నికల్లో కోరామని.. 8 మంది తమ అభ్యర్థులు గెలిచారని చెప్పారు. వందరోజుల పాలన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 41 శాతం ఓట్లు వచ్చాయన్నారు. అసెంబ్లీ ఓట్ల శాతం కంటే ఎక్కువగా లోక్‌సభ ఎన్నికల్లో వచ్చాయి. కాంగ్రెస్ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మేం భావిస్తున్నాం. 8 మంది ఎంపీలను గెలిపించి ఆశీర్వదించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. 2019 ఎన్నికల్లో మాకు 3 సీట్లు వస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య 8కి చేరింది. భారాస ఏడు సీట్లలో డిపాజిట్లు కోల్పోయింది. ఆ 7 సీట్లలో భాజపాను గెలిపించి అవయవదానం చేశారు. భారాస నుంచి బలహీన అభ్యర్థులను పెట్టి భాజపా నేతల గెలుపు కోసం కేసీఆర్ కృషి చేశారు. మెదక్‌లో కాషాయ పార్టీ విజయానికి హరీశ్‌రావు సహకారం అందించారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇదిలావుంటే ప్రజల తీర్పును గౌరవించి ప్రధాని పదవికి మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా మోదీ మళ్లీ ప్రధాని పదవి చేపట్టకూడదన్నారు. ఎన్‌డిఎ మిత్రపక్షాలు మోదీని రాజీనామా కోరాలన్నారు. మోదీ హుందాగా రాజీనామా చేసి ప్రధానిగా తప్పుకుంటే బాగుంటుదని తెలిపారు. రాజకీయ విలువలు చెప్పడానికే మోదీ కానీ వాటిని పాటించరని విమర్శించారు. రాముడి పేరుతో ఓట్లు అడిగితే దేవుడే గుణపాఠం చెప్పాడన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డి, ఇండియా కూటమికి సమానంగా ఫలితాలు వచ్చాయన్నారు సీఎం రేవంత్ రెడ్డి . మోదీ గ్యారెంటీ పేరుతో వెళ్తే జనం తిప్పికొట్టారని చెప్పారు. మోదీ కాలం చెల్లిందని ప్రజలు తీర్పు చెప్పారన్నారు. ఎన్నికల ఫలితాలు ఉగాది పచ్చడి లాంటివని చెప్పారు. ప్రజలు ఏ తీర్పు ఇచ్చినా శిరసావహిస్తామని అన్నారు. గెలుపు, ఓటమి అన్నీటికీ పీసీసీ చీఫ్ గా, సీఎంగా తనదే బాధ్యత అని చెప్పుకొచ్చారు. తమకు ఎవరితో ఎలాంటి భేషాజాలు చెప్పిన సీఎం రేవంత్... రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కొట్లాడుతామన్నారు. ఏపీ ప్రత్యేక హోదాకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఎపిలో చంద్రబాబు ప్రమాణానికి ఆహ్వానిస్తే వెళతామన్నారు. అలాగే ఇప్పుడు హైదరాబాద్ పూర్తిగా తెలంగాణ రాజధాని అని, మిగతా సమస్యలప ఇకముందు కలిసి చర్చించుకుంటామని అన్నారు. మీడియా సమావేశంలో మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్., కడియం శ్రీహరి, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ–జనసేన నేతల విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి..)

పగులగొట్టారు. తిరుపతి జిల్లా పుత్తూరులో పలు ఆలయాల వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్కే రోజా పేరిట ఉన్న శిలాఫలకాలను బుధవారం సాయంత్రం తెలుగుదేశం నాయకులు ధ్వంసం చేశారు. శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం లోపల ఏర్పాటు చేసిన అన్నదాన, కళ్యాణోత్సవ మండప శిలాఫలకాన్ని, ఆరేటమ్మ ఆలయం వద్ద పలు అభివృద్ధి పనుల పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, గేట్‌పుత్తూరులోని గోవిందమ్మ ఆలయం వద్ద ప్రారంభించిన జగనన్న సమావేశమందిర శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.

తెలుగుదేశం నాయకులు డి.జి.ధనపాల్, బి.శ్రీనివాసులు చేసిన ఈ విధ్వంసంపై పుత్తూరు సెంగుంధర్ మక్కల్ నల సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఎన్.గోపిరమణ, టి.జి.శక్తివేలు, ఎం.ఎస్.తిరునావక్కర్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలోని యలమంచిపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ మస్తాన్‌పై టీడీపీ నాయకులు దాడిచేశారు. అడ్డుకోబోయిన ఆయన తల్లి షేక్ బీబీ తలపైకొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఆమెను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తడకలూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త యలమా వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు. మరికొన్ని గ్రామాల్లో కూడా కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. గ్రామాల్లో వివాదాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు.

పంచాయతీలో ఫైళ్ల అపహరణ

ఏలూరు జిల్లా పెదవేగి మండలం గార్లమడుగు సచివాలయం, హెల్త్‌క్లినిక్ ఆవరణలోని శిలాఫలకాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అబ్బయ్యచౌదరి ఫొటోలను సుత్తితో పగులగొట్టారు. తన కార్యాలయంలో వస్తువుల్ని ధ్వంసంచేసి ఫైళ్లు అపహరించారని సర్పంచ్ జిజ్జువరపు నాగరాజు చెప్పారు. కొప్పులవారిగూడెంలోని సచివాలయ ఆవవరణలోని శిలాఫలకా–లను, ప్రభుత్వ సామగ్రిని ధ్వంసం చేశారు.

సచివాలయం ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసే స్థూపానికి టీడీపీ జెండా కట్టారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో బొర్రా నారాయణరావు చికెన్ దుకాణాన్ని టీడీపీ, జనసేన కార్యకర్తలు ధ్వంసం చేశారు. దీనిపై నారాయణరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం సచివాలయం%–%1పై ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు.

వార్డు సభ్యులు ముప్పిడి లక్ష్మణరావు, లక్ష్మణరావులపై దౌర్జన్యానికి దిగారు. నంద్యాల జిల్లా అవుకు మండలం సంగపట్నంలో సచివాలయం, హెల్త్‌క్లినిక్ పైలాన్లను ధ్వంసం చేశారు. టీడీపీ, జనసేన శ్రేణులు విధ్వంసాలకు పాల్పడుతుండగా సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదని పలు గ్రామాల్లో బాధితులు తెలిపారు.

కైకలూరులో వైఎస్సార్‌విగ్రహం ధ్వంసం

కైకలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం వడ్లకూటితిప్పలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద 2010లో వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఆకతాయిలు కూలగొట్టారు.ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఖండించారు. విగ్రహాల కూల్చివేత ఘటనలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి చెందిన వలంటీర్ బాబురావును గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తీవ్రంగా బెదిరించారు. 'అరేయ్ బాబురావుగా నీ పతనం స్టార్ట్ కాబోతుంది.. ఇక నువ్వు ఫిక్స్ అయిపో.. ఇప్పుడు నీ జీవితం నా చేతుల్లో ఉందిరా.. నిన్ను నువ్వు కాపాడుకోవా–లనుకున్నా.. నిన్ను వేరే వాళ్ళు కాపాడాలన్నా.. నీ జీవితాన్ని నేను తిరగరాసినా ఇప్పుడు. నీకు భయం అంటే ఏంటో చూయిస్తారా.. నా కొడకా. అరేయ్ బాబురావుగా.. ఇప్పుడు నీ జీవితం నా చేతుల్లో ఉంది రా.. నీ తలరాత బ్రహ్మ రాసినా ఇప్పుడు నీ జీవితాన్ని నేను తిరగరాస్తా.. కొడకా..' అంటూ స్టేటస్ పెట్టి మరీ హెచ్చరించారు.

మరోవైపు పెదమక్కెన గ్రామంలోని ఎస్సీ కాలనీలో దళితుల ఇళ్లపై టీడీపీ వారు రాళ్లు, సీసాలు విసిరారు. అజయ్‌కుమార్ జీవనాధారమైన ఆటోను ధ్వంసం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతలు,కార్యకర్తలపై దాడులు

ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ వర్గీయులపై కర్రలు, రాళ్లతో దాడులు చేస్తున్నారు. అడ్డొచ్చినవారిని చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర వడ్డికుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, గార్లమడుగు వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణ కారులో వెళుతుండగా విజయరాయి వద్ద టీడీపీ వారు దాడిచేశారు. 'గెలిచింది మేమే.. మాకు తిరుగులేదు.. రండి ఇప్పుడు..' అంటూ కర్రలు, రాళ్లతో కారు అద్దాలు పగులగొట్టారు. కారులో ఉన్న కృష్ణను బలవంతంగా బయటకు లాగి పిడిగుద్దులు గుద్ది రోడ్డుపై పడేశారు. కొంతదూరం లాక్కెళ్లి కొట్టారు. గతంలో చింతమనేని ప్రభాకర్‌పై చేసిన విమర్శలకు క్షమాపణలు చెబుతున్నా అంటూ కృష్ణతో చెప్పించి వీడియో రికార్డు చేశారు. అడ్డుపడేందుకు ప్రయత్నించిన శ్రీనివాసరాజు, సంజీవ్‌కుమార్‌లను తోసేశారు. కారు అద్దాలు పగలడంతో వైఎస్సార్‌సీపీ నాయకులకు గాయాలయ్యాయి. ఈ దాడిని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం కొచ్చెర్లకోట పంచాయతీ సిద్ధాయపాలెంలో సింహం లలిత, ఆమె తండ్రి చొప్పరపు బాలస్వామిపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు.

తీవ్రంగా గాయపడిన బాలస్వామిని తొలుత మార్కాపురం జిల్లా వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యూట్యూబర్ సుంకేసుల ఆదిశేషు ఇంటిపై టీడీపీ వర్గీయులు కొడవళ్లతో దాడిచేశారు. ఆ సమయంలో ఆదిశేషు ఇంట్లో లేకపోవడంతో వారు మహిళలతో దురుసుగా మాట్లాడి సామగ్రిని చిందరవందర చేశారు. ఆదిశేషు భార్య, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# రాష్ట్రమంతా నైరుతి

(మొదటి పేజీ తరువాయి..)

ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ గుండా రుతుపవనాలు కదులుతున్నట్లు చెప్పింది. 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని, కదలికలు ఇదే తరహాలో ఉంటే వారం రోజుల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తాయని అంచనా వేస్తోంది. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటి పూట కొంతసేపు గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నప్ప టికీ.. ఆకాశం మేఘావృతం కావడంతో క్రమంగా ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గుతూ వస్తోంది. సాయంత్రానికి పూర్తిగా చల్లని వాతావరణం ఏర్పడుతోంది. రెండు రోజులు రాష్ట్రంలో ఉష్ణో గ్రతలు సాధారణం, అంతకంటే తక్కువగా నమోదు కావొచ్చని ఆ శాఖ అంచనా వేసింది. నిజామాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత: దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బుధవారం నైరుతి బంగాళాఖాతం ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని పేర్కొంది. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే నిజామాబాద్‌లో 40.1 డిగ్రీ సెల్సీయస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.5 డిగ్రీ సెల్సీయస్‌గా నమోదైంది.

## జవాబుదారీగా

# ప్రభుత్వాన్ని నడుపుదాం..

(మొదటి పేజీ తరువాయి..)

సంపూర్ణ జీతం తీసుకుంటా. ఎందుకంటే ఈ డబ్బు ప్రజల రక్తం, చమట, స్వేదం నుంచి వచ్చింది. ఆ డబ్బు ముట్టుకున్నప్పుడల్లా నాకు ఆ బాధ్యత అనుక్షణం గుర్తు రావాలి. ఒకవేళ నేను సరిగా పని చేయకుంటే ప్రతి రూపాయికి నన్ను చొక్కా పట్టుకుని నిలదీసే హక్కు ప్రజలకు ఉండాలి. అందుకే పూర్తి జీతం తీసుకుంటాను. ఆ తర్వాత ఇవ్వాల్సింది ఎలాగో ఇచ్చేస్తాను. అందరం కూడా జవాబుదారి ప్రభుత్వం ఎలా ఉంటుందో చూపిద్దాం.' అని పవన్ పేర్కొన్నారు. ఇది పండుగ చేసుకునే సమయం కాదని.. బాధ్యతతో ఉండాల్సిన సమయమని పవన్ కల్యాణ్ అన్నారు. చట్టాలను చేసేవాళ్లు ఎలా ఉండాలో చూపిద్దామని.. పార్లమెంటుకు వెళ్లేది ప్రజల కోసం పని చేయడానికే అని గుర్తుంచుకోవాలన్నారు. రక్తం ధారబోసిన జనసైనికులు, వీర మహిళలు పార్టీని గెలిపించారని చెప్పారు. 'కేంద్రంలో కీలకం కాబోతున్నాం. ఎంపీలు ఉదయ్, బాలశౌరికి చాలా బాధ్యత ఉంది. ఢిల్లీ జనసేన ఎంపీల కదలికలను ప్రతి ఒక్కరూ పరిశీలిస్తారు. జాగ్రత్తగా ఉండాలి. ఇది అద్భుత విజయం. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ గెలవడం చారిత్రాత్మక విజయం.' అని పవన్ పేర్కొన్నారు. ఇప్పుడు ఎంత బాధ్యతగా ఎలా పని చేశామో.. అంతకు మించిన స్థాయిలో ఇక నుంచి కూడా పార్టీ కోసం పని చేయాలని జనసేన నేత నాదెండ్ల మనోహర్ సూచించారు.

# చంద్రబాబు పిలిస్తే వెళ్తా

(మొదటి పేజీ తరువాయి..)

జరగబోయే ప్రమాణస్వీకారోత్సవానికి చంద్రబాబు పిలిస్తే తప్పకుండా వెళ్తానంటూ సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇదిలా ఉంటే ఏపీలో ఎన్నికల ఫలితాలు వెలువడిన సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన ప్రతి విషయంలోనూ సామరస్యంగా ముందుకువెళ్తామంటూ సోషల్ మీడియా వేదికగా రేవంత్ రెడ్డి పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, ఏపీలో మే 13న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో కూటమి అధిక సీట్లను కైవసం చేసుకుంది. ఇటు వైసీపీ కేవలం 11 సీట్లలో మాత్రమే గెలిచింది. కనీసం ప్రతిపక్ష హోదా వచ్చేందుకు కావాల్సిన సీట్లలో కూడా గెలవలేకపోయింది. ఊహించని విధంగా కూటమి అధిక సీట్లు గెలుచుకుంది. దీంతో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇటు ఎన్డీఏ కూటమిలో కూడా టీడీపీ, జనసేన పార్టీలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎన్డీఏ కూటమిలో ఓ పదవిని కూడా ఆఫర్ చేయగా, చంద్రబాబు ఆలోచించి చెబుతానంటూ పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఏపీ అసెంబ్లీ రద్దు..

(మొదటి పేజీ తరువాయి..)

ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో గ్రాండ్ విజయం సాధించిన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్, బాలకృష్ణ తదితరులకు ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు. మెగా ఫ్యామిలీ, దగ్గుబాటి ఫ్యామిలీ, నందమూరి ఫ్యామిలీల హీరోలంతా నెట్టింట శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు చేస్తున్నారు. హీరో రామ్ చరణ్ బాబాయ్ పవన్ గెలుపుపై ఆనందం వ్యక్తం చేశాడు. మా కుటుంబానికి గర్వకారణమైన రోజు.. మీ అద్భుతమైన విజయానికి నా అభినందనలు మై పవన్ కళ్యాణ్ గారూ!" అంటూ %శ% వేదికగా ట్వీట్ చేశాడు. పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సినీ నటుడు వెంకటేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. "చారిత్రక విజయం సాధించిన ప్రియమైన పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు. ఈ విజయానికి నీవు సంపూర్ణ అర్హుడివి. ఇదే ఉత్సాహంతో ఉన్నతస్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నా. పిఠాపురం ఎమ్మెల్యేగారికి మరోసారి నా హృదయ పూర్వక శుభాకాంక్షలు" అని ట్వీట్ చేశారు. చంద్రబాబుకు హీరో కళ్యాణ్ రామ్ శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే ఘనమైన విజయాన్ని సాధించిన చంద్రబాబు మావయ్యకీ తన హృదయపూర్వక అభినందనలు అని ఆయన ట్వీట్ చేశారు. మీ కృషి, పట్టుదల ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మెరుగుపరుస్తుందని ఆశిస్తున్నా అన్నారు. అలాగే మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన బాలకృష్ణ కు శుభాకాంక్షలు తెలిపారు.







# ప్లాస్టిక్ నిషేదిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం..

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు
- ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు ప్రాణాలకు ముప్పు
- ఉమామహేశ్వర కొండపై ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్ జూన్ 5:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో నల్లమల్ల లో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను వెయ్యరాదు.... పర్యావరణాన్ని కాపాడు కుందాం.... అంటూ ఫారెస్ట్ ఉన్నతాధికారులు టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఫ్లెక్సీలు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారుల వెంట ప్లాస్టిక్ విడత పదార్థాలను సేకరించారు. బుధవారం అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో అటవీశాఖ ఉన్నతాధికారులు టీమ్లు వైస్ గా బయలుదేరి ప్రధాన రహదారుల వెంట ఉన్న వివిధ ప్రదర్శన సేకరించి ఒకచోట నిప్పు పెట్టి అందించడం జరిగింది. అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, పదర, లింగాల, బల్మూర్ మండలాలతో పాటు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఫారెస్ట్ ఉన్నతాధికారులు బృందాల వారీగా ఏర్పడి ఒక్కొక్కరు టీములుగా విడిపోయి ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను సంచులలో సేకరించారు. ఇకముందు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు అటవీ మార్గం వెంట ఎక్కడ కూడా వెయ్యరాదని ఫ్లెక్సీల రూపంలో ప్రజలకు అవగాహన చేయడం జరిగింది. శ్రీశైలం వచ్చే భక్తులు నల్లమల్ల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఎక్కడ కూడా ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను వేయరాదని పర్యావరణం దినోత్సవం ఫ్లెక్సీల రూపంలో పలువురికి నిరసన రూపంలో వ్యక్తం చేస్తూ, వివరించడం జరిగింది. వ్యర్థ పదార్థాలు వేయడం వల్ల పర్యావరణం కాలుష్యం పెరగడంతో పాటు పర్యావరణం మరింత దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను వాడొద్దు... వాడితే మానవ మనవడేకే ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ దినోత్సవ సందర్భంగా అటవీశాఖ అధికారులు పలువురికి సూచించడం జరిగింది. అటవిశాఖ అధికారి ఐఎఫ్ఎస్సి శంకర్ బోబిడే, అటవీశాఖ డివిజనల్ డైరెక్టర్ క్షితిజా, డీఎఫ్ఓ రోహిత్ గోపిడిల ఆదేశాల మేరకు పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ ఆర్ వో లు, గోపాల్, జాఫర్ ఫరీద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ బాలకృష్ణయ్య, సుజాత, బీట్ ఆఫీసర్స్ లతోపాటు అటవీశాఖ ట్రైలర్ రాకర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నైతిక విజయం కాంగ్రెస్‌దే

- నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి

**(నేటి ఫోకస్ న్యూస్) మెదక్ ప్రతినిధి/ జూన్ 5 :**

నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి గడిచిన పార్లమెంట్ ఎన్నికలను ఉద్దేశించి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా పాలన,ఆరు గ్యారెంటీలను చూసి నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు నియోజకవర్గంలో 18 వేల పైచిలుకు ఓట్లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఆదిఖ్యతను అందించారని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొరకు పనిచేసిన కార్యకర్తలకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తోనే వెనుకబడిందని అన్నారు.పార్లమెంట్ పరిధిలో %దీ=వా% ఓట్ల శాతం ఎందుకు తగ్గిందని బారాస కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 80 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన వ్యక్తి నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల్లో కేవలం 2,300 మెజారిటీకి దిగజారిందన్నారు. హరీష్ రావు,సునీత రెడ్డి భవిష్య త్తు కాదు, కార్యకర్తల భవిష్యత్తు నష్టమవుతుందని ఈ సందర్భంగా అన్నారు. సునీత రెడ్డికి పార్టీలు మరడం కొత్తకాదు అన్నారు. నియోజక వర్గంలో విపరీతమైన డబ్బు ప్రభావాన్ని చూపింది అనీ అయిన ఆ పార్టీని నమ్మేస్థితిలో ప్రజలు లేరని అన్నారు. సాంకేతికంగా మధు ఓడిపోయిన, నైతిక విజయం మధుదే అని వారు అన్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటామని, వారి అభ్యున్నతికి నిరంతంగా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారు,సుహాసిని రెడ్డి గారు, రవీందర్ రెడ్డి గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియమాలను పాటించని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలపై
# చర్యలు తీసుకోవాలి





- నిబంధనలను పాటించకుండా బుక్స్ యూని ఫామ్ అమ్ముతున్నారు
- మీసాల లక్ష్మీనివాస్ టి.ఎస్.ఎస్.ఓ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు
- నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలకు పర్మిషన్ రద్దు చేయాలి
- క్వాలిఫైడ్ కానీ నిరుద్యోగులతో విద్య బోధన
- ఆట స్థలాలు, ఫైర్ సేఫ్టీ లను తుంగలో తొక్కేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ వ్యాపారులు

**ఫోకస్ న్యూస్, జుక్కల్, కంటోన్మెంట్, జూన్ 5:**

ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, ప్రభుత్వ విద్య విధానాలను తుంగలో తొక్కేస్తున్న, కార్పొరేట్ మరియు ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, టి.ఎస్.ఎస్.ఓ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీ నివాస్ కోరారు. బుధవారం నాడు రంగారెడ్డి జిల్లా డిఈఓ సుసింధర్ రావు, ఎంఈఓ రామ్ రెడ్డి లకు సంఘం నాయకులతో కలిసి లక్ష్మీనివాస్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మీసాల లక్ష్మీనివాస్ మాట్లాడుతూ... కార్పొరేట్ మరియు ప్రభుత్వ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠశాలలో పాఠ్యపుస్తకాలు యూనిఫార్మ్ బూట్లు అమ్ముతున్నారని, సరైన పాఠశాల భవనాలు సక్రమంగా లేకపోవడం, ఫిట్నెస్ లేని బస్సులు నడపడం, క్వాలిఫైడ్ టీచర్లతో కాకుండా ఇంటర్ టెన్త్ పాస్ అయిన వారితో ముఖ్య బోధన చేయించడం జరుగుతున్నాయని అలాంటి పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, డి.ఈ.ఓ సుశింధర్ సుసింధర్ రావు ను కోరారు. ఈ కార్యక్రమంలో టి.ఎస్.ఎస్.ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, టి.ఎస్.ఎస్.ఓ నాయకులు దర్శన్ వెంకట్ సచిన్ వంశీ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నైతిక విజయం బిజెపిదే

- బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము



**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:**

నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గంలో తక్కువ మెజారిటీతో ఓడినా బిజెపి పార్టీనే నైతిక విజయం సాధించిందని వనపర్తి పట్టణ బిజెపి అధ్యక్షుడు బచ్చు రాము అన్నారు. ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషిచేసిన కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులకు, ఓటు వేసి ఆదరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నానని తెలిపారు. వనపర్తి పట్టణంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు పోలైన ఓట్ల కన్నా బిజెపి పార్టీకి దాదాపు 2000 వరకు ఓట్లు ఎక్కువగా పోలయ్యాయని బిజెపి పార్టీ పైన నమ్మకం ఉంచి మెజారిటీ ఇచ్చిన వనపర్తి పట్టణ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రతి ఇంటికి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందజేస్తానని పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన తనను సంప్రదించాలని ఎల్లప్పుడూ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# ప్రజా నాయకుడి గెలుపు ప్రజలకు అంకితం

- శ్రీ గణేష్‌ను సన్మానించిన, మైనంపల్లి..
- తోట ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 5:**



కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో తన గెలుపు కోసం నిరంతరం శ్రమించిన, మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావును కలిసి, కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్. తదనంతరం మైనంపల్లి హనుమంతరావు శ్రీ గణేష్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అలింగానం చేసుకున్నారు. అనునిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. తదనంతరం అల్వాల్ లోని తోట ముత్యాలమ్మ దేవాలయంలో మైనంపల్లి తో కలిసి శ్రీ గణేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకులను ఇంటి దొంగలనడం
# ఎమ్మెల్యే మేఘారెడ్డికి తగదు

- బయటి దొంగల మాటలు విని ఎమ్మెల్యే నిందించడం సరికాదు
- ఎమ్మెల్యే సొంత మండలం పెద్దమందడిలో బిజెపికి 772 ఓట్ల ఆదిక్యం
- కాంగ్రెస్ కౌన్సిలర్లకు కాదని బయటి నుంచి వచ్చిన కౌన్సిలర్లను ఎలా మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను చేస్తారు
- రాజీవ్ చౌక్‌లో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన మేఘారెడ్డి విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతూ ఇంటి దొంగలు అని సంబోధించడం సరికాదని డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆక్షేపించారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వనపర్తి నియోజకవర్గంలో స్వల్ప మెజారిటీ రావడంతో అందుకు కారణాలు ఏమిటో తెలుసుకోకుండా బహిరంగంగా ఇంటి దొంగల పనేనంటూ బహిరంగ విమర్శలు చేయడం తగదన్నారు. స్వయాన తన పెద్దమందడి మండలంలోనే కాంగ్రెస్ పార్టీ వెనుకబడి బిజెపికి 772 ఓట్లు వచ్చాయని అన్నారు. 20, 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేస్తున్న సీనియర్లపై ఎమ్మెల్యే క్రమశిక్షణ రాహిత్యంగా మాట్లాడడం పార్టీ విధానానికి విరుద్ధమన్నారు. బయటి దొంగలను పార్టీలో చేర్చుకొని మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు తీరని అన్యాయం చేశావని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ముందు బయటి దొంగలు గోవాలో ప్రమాణాలు చేసి బిఆర్ఎస్ కు తప్ప మరెవ్వరికీ ఓటు వేయమని చెప్పి ఇప్పుడు ఎవరికి వేశారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఏఐసిసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి 20వేల పాంప్లెంట్లు ముద్రించారని అలాగే డిసీసీ అధ్యక్షులుగా తాను 30 వేల పాంప్లెంట్లు ముద్రించి ఇంటింటికి పంచామని చెప్పారు. కార్యక్రమంలో వనపర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు నారాయణ, పెద్దమందడి మండల అధ్యక్షులు పెంటన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు రాములు యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దివాకర్ యాదవ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు జానకి రాములు, ఎల్లయ్య, బాబా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం వినోద్, రామ్ చందర్, రామరాజు, మద్దిలేటి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.





# 8న జాతీయ లోక్‌అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్.సునీత

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

వనపర్తి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. ఆర్. సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీ మార్గం ద్వారా సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన వాటిని పరిష్కారం చేయాలని ఆమె కోరారు. వివిధ కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కారం చేసేందుకు పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులతో మాట్లాడి రాజీకి కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రిలిటిగేషన్, బిఎస్ఎన్ఎల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకులకు సంబంధించిన మొండి బకాయిల కేసులు, ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన కేసులను పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్ ను ఒక వేదికగా ఉపయోగించుకుని రాజీ చేయించాలని కోరారు. కాగా కేసుల పరిష్కారం కోసం వనపర్తి కోర్టు ప్రాంగణంలో నాలుగు లోక్ అదాలత్ బెంచ్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు.

## పర్యావరణ దినోత్సవం సందర్భంగా
# మొక్కలు నాటిన ఎమ్మెల్యే

**మిర్యాలగూడ, (నేటి ఫోకస్‌న్యూస్)–జూన్ 05 :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు గౌ,, శ్రీ బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ పరిసరాలలో మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. పర్యావరణ పరిశోధకుల కథనం ప్రకారం వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ఈ సందర్భంగా మొక్కలను నాటడం అనేది ప్రతిఒక్కరం తమ బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని అన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే సులువైన మార్గం అని అన్నారు.





## టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు
# బయోమెట్రిక్‌పై శిక్షణ

**మహబూబాబాద్ (నేటి ఫోకస్ న్యూస్)జూన్ 05**

జూన్ 9 న నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్ %×% ప్రిలిమినరీ పరీక్షకు బుదవారం పట్టణంలోని ఎన్.ఆర్.ఆర్. గవర్నమేంట్ కళాశాల నందు చీఫ్ సూపరింటెన్డెంట్లు మరియు బయో మెట్రిక్ ఇన్విజిలేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 12 సెంటర్లకు సంబందించిన చీఫ్ సూపరింటెన్డెంట్లు 34 మంది బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస రావు పి.పి.టి ద్వారా సీటింగ్ ప్లాన్,విధులు,టైమింగ్ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్.పి.చెన్నయ్య బయోమెట్రిక్ ప్రాముఖ్యత, బయోమెట్రిక్ హాజరు ఏవిధంగా తీసుకోవాలి తగిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బయోమెట్రిక్ అధికారులు సి.ఐ.సత్యనారాయణ, ఎస్.ఐ దిలీప్ పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత
# ప్రతి ఒక్కరిపై ఉంది

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ థామస్, రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి లు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరార. చెట్లను నరికి వేయడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ ఎఫెక్ట్ వలన భూమిపై అత్య ధిక వేడి వాతావరణం ఏర్పడుతుందని దీనివల్ల జీవజాతికి ప్రాణ సంకటం ఏర్పడి జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ ఇన్స్పెక్టర్ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవలసిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సఖి సెంటర్‌కు చెంది న కవిత, ఇండియా లిటరసి ప్రాజెక్ట్ సిబ్బంది శ్రీలక్ష్మి, కైలాస్ సత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన జూనియర్ ఎన్టీఆర్

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు జూనియర్ ఎన్టీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అసాధారణ విజయాన్ని సొంతం చేసుకున్న కూటమికి చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తెదేపా అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్‌లను అభినందిస్తూ సినీ ప్రముఖులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. తాజాగా ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు. చారిత్రాత్మకమైన విజయాన్ని సాధించినందుకు ప్రియమైన చంద్రబాబు మావయ్యకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ ఈ విజయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిపథం వైపు నడిపిస్తుందని ఆశిస్తున్నా. అద్భుతమైన మెజారిటీతో గెలిచిన నారాలోకేశ్‌కు, మూడోసారి ఘన విజయం సాధించిన బాలకృష్ణ బాబాయ్‌కి, ఎంపీలుగా గెలిచిన శ్రీ భరత్, పురందేశ్వరి అత్తకు శుభాకాంక్షలు. అలాగే ఇంతటి ఘన విజయాన్ని సాధించిన పవన్ కల్యాణ్ గారికి నా హృదయ పూర్వక శుభాకాంక్షలు అని తెలిపారు. మీ కృషి, పట్టుదల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తుని కచ్చితంగా మెరుగుపరుస్తుందని ఆశిస్తున్నా. వరుసగా మూడోసారి హిందూపురం శాసనసభ్యుడుగా అఖండ విజయం సాధించిన నందమూరి బాలకృష్ణ బాబాయ్‌కు శుభాకాంక్షలు. భారీ మెజారిటీతో గెలుపొందిన నారాలోకేష్, శ్రీ భరత్, పురందేశ్వరి అత్త గారికి నా శుభాకాంక్షలు. అలాగే జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌కి అద్భుత విజయం సాధించినందుకు నా శుభాకాంక్షలను నందమూరి కల్యాణ్ రామ్ తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్డీయే కూటమికి, ఆంధ్రప్రదేశ్‌లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు. ఆ దేవుడి ఆశీస్సులు మీపై ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు నాగార్జున వెల్లడించారు. దార్శనికుడు చంద్రబాబుకు శుభాకాంక్షలు. అద్భుతమైన విజయం సాధించారని రామ్‌చరణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి సభ్యులందరికీ విజయాభినందనలు. బాబు, పురందేశ్వరి, పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అభినందనలు అని పరుచూరి గోపాలకృష్ణ తెలిపారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరితో దిగిన ఫొటోను గాయని స్మిత షేర్ చేసి విషెస్ చెప్పారు.

# కాంతారలో మెప్పించిన సప్తమి గౌడ

కన్నడ నటుడు రిషబ్ శెట్టి దర్శకత్వం వహించి, కథానాయకుడిగా నటించిన 'కాంతారా' ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిన విషయమే. ఒక్క కన్నడంలోనే కాకుండా, సినిమా తెలుగుతో పాటు, మిగతా భాషల్లో సూపర్ డూపర్ హిట్ అయింది. అందులో రిషబ్ శెట్టి సరసన సప్తమి గౌడ అనే ఆమె కథానాయకురాలిగా నటించింది. రిషబ్ శెట్టితో పాటు, సప్తమి గౌడకి మంచి పేరు వచ్చింది ఆ సినిమాలో. ఒక ప్లలెటూరి అమ్మాయిగా, తరువాత ఫారెస్ట్ గార్డుగా సెలక్టు అయి, తన ఊరి వాళ్ళకి వ్యతిరేకంగా పోరాడాల్సి వచ్చినప్పుడు, ఎటువంటి భావోద్వేగాలు ఉంటాయి, అవన్నీ చక్కగా చేసి చూపించింది సప్తమి గౌడ. ఆ సినిమాలో రిషబ్ శెట్టికి జోడీగా నటించిన సప్తమి గౌడకి అది రెండో సినిమా. అంతకు ముందు ఆమె 'పాప్ కార్న్ మంకీ టైగర్' అనే సినిమా మాత్రం చేసింది. రెండో సినిమా అయినా ఎంతో అనుభవం వున్న నటిలా చాలా చక్కని నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది సప్తమి గౌడ. 'కాంతారా' తరువాత సప్తమి గౌడ 'వాక్సిన్ వార్' అనే సినిమాలో నటించింది. ఇది దక్షిణాది భాషలతో పాటు, హిందీలో కూడా నిర్మించారు. అక్కడ కూడా విడుదల చేశారు. ఇది ఒక వైద్య వృత్తికి సంబందించిన సినిమా. ఇందులో కోవిడ్ వ్యాధి వచ్చినప్పుడు ఆ వ్యాధి నివారణ కోసం శాస్త్రవేత్తలు ఎలా వ్యాధిని కనిపెట్టారు, వారికి కలిగిన అవరోధాలు, ఇంకా అటువంటి విషయాలతో ఈ సినిమా నిర్మించారు. వివేక్ అగ్నిహోత్రి ఈ సినిమాకి దర్శకుడు. ఈ సంవత్సరం ఆమె సినిమా 'యువ' కూడా విడుదలైంది. మార్చి 29న విడుదలైన ఈ సినిమాకి మిశ్రమ స్పందన లభించింది. 'కేజీఎఫ్' , 'సలార్' లాంటి సినిమాలు నిర్మాణం చేసిన హోంబలే ఫిలిమ్స్ ఈ సినిమాకి నిర్మాతలు కావటం విశేషం.






# బెంగాల్ రాజకీయాల్లో రచనా మోత

## టీఎంసీ ఎంపీగా అఖండ విజయం

తెలుగులో పలు సినిమాల్లో నటించి మెప్పించిన బెంగాలీ నటి రచన బెనర్జీ అక్కడి రాజకీయాల్లో చరిత్ర సృష్టించింది. తొలి ప్రయత్నంలోనే మరో నటి బీజేపీ అభ్యర్థి లాకెట్ ఛటర్జీపై 70 వేల ఓట్ల మెజార్టీ తేడాతో విజయం సాధించి వార్తల్లో నిలిచింది. బెంగాలీలో సుమారు 200 వరకు చిత్రాల్లో నటించిన రచన ఒడియాలోనూ ఎక్కువ చిత్రాలు చేసి మంచి పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాలలోనూ నటించింది. గతంలోనూ తెలుగు సినిమాల్లో నటించిన నవనీత్ రానా మహారాష్ట్ర అమరావతి నుంచి ఎంపీగా గెలిచిన విషయం అందరికి తెలిసిందే. తెలుగులో ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో జేడీ చక్రవర్తి హీరోగా వచ్చిన నేను ప్రేమిస్తున్నాను అనే చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రచనా బెనర్జీ ఇక్కడ డజన్‌కు పైగానే చిత్రాలు చేసింది. వీటిలో చిరంజీవితో బావగారు బాగున్నారా, బాలకృష్ణతో సుల్తాన్ వంటి సినిమాలతో పాటు కన్యాదానం, పిల్ల నచ్చింది, ఎస్వీ కృష్ణారెడ్డి అభిషేకం చిత్రాల్లో నటించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. తెలుగులో చివరగా 2002లో వచ్చిన లాహిరి లాహిరిలో సినిమాలో సుమన్ సరసన నటించిన రచన ఆ తర్వాత తెలుగులో కనిపించ లేదు. తన రాష్ట్రంలో సినిమాలు, టీవీ షోలతో బీజీ అయింది. దీదీ నెం1 అనే టెలివిజన్ షోతో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా అద్భుతమైన పేరు తెచ్చుకున్న రచన రెండు మూడు నెలల క్రితమే సీఎం మమతా బెనర్జీ సమక్షంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరి సంచలనం సృష్టించింది. ఆ వెంటనే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో హుగ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచింది. ఈ క్రమంలో తన ప్రత్యర్థి బీజేపీ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ లాకెట్ ఛటర్జీపై 70 వేల ఓట్ల మెజార్టీతో గెలవడం విశేషం.



# జూన్ 10న కల్కి ట్రైలర్ విడుదల

## ఆసక్తి పెంచుతున్న మూవీ ప్రమోషన్స్..




ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు ట్రెండ్ అవుతున్నాయి. వాటితో పాటు 'కల్కి' హ్యాష్ ట్యాగ్ కూడా ఎక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. దీనికి కారణం సినీప్రియులను ఖుష్ చేస్తూ.. 'కల్కి 2898 ఏడీ' చిత్రబృందం ఓ అప్‌డేట్‌ను పంచుకోవడమే. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. వారి ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ ఓ క్రేజీ అప్‌డేట్‌ను పంచుకుంది మూవీ యూనిట్. ఈ సినిమా ట్రైలర్ జూన్ 10న విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్‌ను షేర్ చేసింది. ఇప్పటికే విడుద లైన దీని టీజర్, ప్రత్యేక వీడియోలు విశేషంగా ఆకట్టుకొని సినిమాపై అంచ నాలు పెంచేశాయి. ఇప్పుడు ట్రైలర్ వాటిని రెట్టింపు చేయడం ఖాయమని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ట్రైలర్‌ను థియేటర్‌లో ప్రదర్శించనున్నట్లు టాక్ వినిపిస్తుంది. ఏపీలో ఎక్కువ థియేటర్‌లలో దీన్ని ప్రదర్శించాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. జూన్ 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. దీంతో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను భారీ స్థాయిలో దీన్ని నిర్వహించాలని లాన్ చేస్తున్నారని సమాచారం. అది కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్వహించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు కల్కి టీమ్ ప్రమోషన్ జోరు పెంచింది. సినీ సెలబ్రిటీల పిల్లలకు ఈ సినిమాలోని బుజ్జి, భైరవాల గిఫ్ట్‌లను పంపుతోంది. ఇప్పటికే రామ్ చరణ్, మహేశ్‌బాబు కుమార్తెలు ఈ బహుమతి అందుకోగా.. తాజాగా స్టార్ హీరో యశ్ పిల్లలు కూడా బుజ్జి–భైరవ స్టికర్లు అందుకున్నారు. త్వరలోనే మరికొంతమంది ఈ బహుమతులు అందుకోనున్నారు. ప్రచారంలో భాగంగానే తాజాగా 'బుజ్జి అండ్ భైరవ' పేరుతో టీమ్ యానిమేటెడ్ సిరీస్ తీసుకొచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్‌కు మంచి ప్రేక్షకా దరణ వచ్చింది. ప్రభాస్ సరసన దీపిక పదుకొణె నటిస్తుండగా.. సీనియర్ హీరో కమల్‌హాసన్ విలన్ పాత్రలో కనిపించను న్నారు. అలాగే అమితాబ్

